## పాక్ హైకమిషన్ అధికారిని బహిష్కరించిన భారత్

### 24 గంటల్లో దేశం వీడాలని ఆదేశం

న్యూఢిల్లీ: తన కార్యాలయ పరిధి దాటి కార్యకలాపాలు సాగిస్తున్న పాకిస్థాన్ హై కమిషన్ అధికారిని భారత్ మంగళవారం బహిష్కరించింది. అతను 24 గంటల్లో భారత్‌ను విడిచిపెట్టి వెళ్లిపోవాలని ఆదేశించినట్టు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రెండు దేశాల మధ్య నాలుగు రోజుల పాటు జరిగిన సైనిక ఘర్షణ అనంతరం ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో భారత్ ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే ఆ అధికారి కార్యకలాపాలపై న్యూఢిల్లీలోని పాకిస్థాన్ డీ అఫైర్స్‌కు తెలియజేసింది.

## బాయ్‌కాట్ తుర్కియే

### దేశవ్యాప్తంగా ఊపందుకున్న నినాదం

### ఆ దేశ టూరిజంపై తీవ్ర ప్రభావం

ఢిల్లీ, మే 13: భారత్-పాక్ ఉద్రిక్తతల సమయంలో దాయాదికి తుర్కియే మద్దతుగా నిలిచిన నేపథ్యంలో 'బాయ్‌కాట్ తుర్కియే' నినాదం ఊపందుకున్నది. యుద్ధ సమయంలో పాక్‌కు తుర్కియే బహిరంగంగా మద్దతు ప్రకటించడమే కాకుండా డ్రోన్లను సాయం చేసిన విషయం విదితమే. ఆ డ్రోన్లనే పాక్ మన దేశంపై ప్రయోగించింది. ఈ నేపథ్యంలో చాలామంది సోషల్‌మీడియా వేదికగా 'బాయ్‌కాట్, బాన్ తుర్కియే'ని ట్రెండ్ చేస్తున్నారు. మొన్నటివరకు సోషల్‌మీడియాలో కొనసాగిన ఈ ట్రెండ్ ఇప్పుడు క్షేత్రస్థాయిలో అన్ని రంగాలకు వ్యాపిస్తున్నది. ఇప్పటికే తుర్కియే టూరిజంపై దాని ప్రభావం పడింది. ఆ దేశానికి వెళ్లాలనుకునే అనేక మంది భారతీయ పర్యాటకులు విమాన టికెట్లు, హోటళ్ల బుకింగ్‌లను క్యాన్సిల్ చేసుకుంటున్నారు. ఇప్పటికే 80 శాతానికి పైగా బుకింగ్‌లు వాయిదా లేదా క్యాన్సిల్ అయినట్టు తెలుస్తున్నది. రాజధాని అంకారా టూరిజం తీవ్రంగా ప్రభావితమైంది.

**యాపిల్ మార్కెట్‌పై ఎఫెక్ట్...**

ఈ ప్రభావం తుర్కియే యాపిల్ మార్కెట్‌పై కూడా పడింది. తుర్కియే యాపిళ్లను దిగుమతి చేసుకోవద్దని పుణె వ్యాపారులు నిర్ణయించారు. తుర్కియే యాపిళ్ల టర్నోవర్ ఒక సీజన్‌లో రూ.1000-1200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఒక్కసారిగా దిగుమతులను తగ్గించుకోవడంతో యాపిళ్లకు భారీగా డిమాండ్ ఏర్పడి హోల్‌సేల్‌గా 10 కిలోల యాపిళ్ల ధరలు రూ.200-300 వరకు పెరిగాయి. రిటైల్ ధరలు కిలోకు రూ.20-30 వరకు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఇరాన్, వాషింగ్టన్, న్యూజిలాండ్‌లతోపాటు మన దేశంలోని హిమాచల్, ఉత్తరాఖండ్‌ల నుంచి యాపిళ్లను దిగుమతి చేసుకునేందుకు వ్యాపారులు మొగ్గుచూపుతున్నారు.

# ఆత్మరక్షణలో మోదీ!

## 'కాల్పుల విరమణ' నిర్ణయంపై సర్వత్రా విమర్శలు

- మోదీ ప్రభుత్వం వైఖరిపై రాజకీయ, బుద్ధిజీవుల ఫైర్
- పరిస్థితి చేజారడంతో ఇమేజ్ మేకోవర్ యత్నాల్లో ప్రధాని
- జాతినుద్దేశించి ప్రసంగించినా తగ్గని నెటిజన్ల వ్యతిరేకత
- దీంతో జవాన్లకు ధైర్య వచనాలు
- ఇప్పుడు ఎందుకని నెటిజన్ల విమర్శలు



మంగళవారం పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్ సిబ్బందితో ప్రధాని నరేంద్ర మోదీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ): పాకిస్థాన్‌పై భారత్ పైచేయి సాధించినప్పటికీ, 'కాల్పుల విరమణ'పై మోదీ ప్రభుత్వం అంగీకారం తెలుపడం యావత్ జాతి జనులను విస్మయానికి గురి చేసింది. మోదీ ప్రభుత్వ నిర్ణయంపై రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, మేధావులు, రక్షణ రంగ నిపుణులు, కళాకారులు, జర్నలిస్టులు ఇలా ప్రతీ ఒక్కరూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆత్మరక్షణలో పడిన ప్రధాని మోదీ డ్యామేజీ కంట్రోల్‌కు దిగడంతో పాటు ఇమేజ్ మేకోవర్‌కు ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు అర్థమవుతున్నది. సోమవారం జాతినుద్దేశించి ప్రసంగించడం, ఆ మరుసటి రోజే పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించడం ఇందులో భాగమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**మోదీ సర్కారుపై ఫైర్**

పహల్గాం ఉగ్రదాడి బాధితులకు న్యాయం పేరిట పాక్‌పై 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించిన మోదీ ప్రభుత్వం అర్ధాంతరంగా 'కాల్పుల విరమణ'కు అంగీకరించడాన్ని దేశంలోని అన్ని వర్గాలు ఖండించాయి. భారత్-పాక్‌కు సంబంధించిన ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం చేసుకోవడం ఏమిటని నిలదీశాయి. ఈ క్రమంలోనే పలువురు రాజకీయ నాయకులు, బుద్ధిజీవులు ఎన్డీయే ప్రభుత్వంపై మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం తీసుకొన్న కాల్పుల విరమణ నిర్ణయాన్ని చరిత్ర ఎన్నటికీ క్షమించబోదని జియో స్ట్రాటజిస్ట్ బ్రహ్మ చెల్లానీ ధ్వజమెత్తారు. 'కాల్పుల విరమణ'పై అమెరికా మధ్యవర్తిత్వంపై కేంద్రం వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. భారత్ వంటి సంక్లిష్ట దేశానికి ప్రధానిగా వ్యవహరించే వ్యక్తి బాగా చదువుకున్న వాడై ఉండాలంటూ సొంత పార్టీ సీనియర్ నేత సుబ్రమణ్యస్వామి మోదీని పరోక్షంగా టార్గెట్ చేశారు. సార్వభౌమాధికారంపై రాజీపడి మోదీ సర్కారు ట్రంప్‌నకు అమ్ముడుపోయిందా? అంటూ శివసేన ధ్వజమెత్తింది. యుద్ధ వాతావరణం సృష్టించి, మధ్యలో కాడి వదిలేస్తూ 140 కోట్ల మంది ఆత్మగౌరవంతో ఆటలు ఆడటమేంటని భోజ్‌పురి సింగర్ నేహాసింగ్ మోదీ ప్రభుత్వాన్ని విమర్శించారు. 'కాల్పుల విరమణ'పై తనను తానే మోదీ అపహాస్యం చేసుకొన్నారని కార్టూనిస్ట్ మంజుల్ ధ్వజమెత్తారు. కశ్మీర్ విషయంలో మూడో పక్షాన్ని ఎందుకు అనుమతించాల్సి వచ్చిందో చెప్పాలని ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ డిమాండ్ చేశారు. మధ్యవర్తిత్వం వహించడానికి అమెరికాకు మోదీ అవకాశం కల్పించడం అతిపెద్ద దౌత్య వైఫల్యమని రాజకీయ విశ్లేషకుడు తన్మయ్ ఘోష్ విరుచుకుపడ్డారు. ట్రంప్ ఒత్తిడితో మోదీ కాల్పుల విరమణకు రాజీపడటం అవమానకరమని రక్షణ రంగ నిపుణుడు సుశాంత్ సింగ్ అభిప్రాయపడ్డారు.

### టీవీల్లోనూ ఆదరణ నిల్

**'యుద్ధాల** యుగం కాదు' అంటూ ప్రధాని మోదీ సోమవారం జాతినుద్దేశించి చేసిన ప్రసంగం ఏ మాత్రం ప్రభావం చూపించలేకపోయింది. 'కాల్పుల విరమణ' ఎందుకు అంగీకరించాల్సి వచ్చింది?, 'ట్రంప్ జోక్యం' ఎందుకు అనుమతించారు? అనే కీలక విషయాలను ప్రధాని విస్మరించడంతో ఆయన ప్రసంగంపై ఎవరూ అంతగా ఆసక్తి చూపించలేదు. దీన్ని ధ్రువపరుస్తూ.. లైవ్ స్ట్రీమింగ్, యూట్యూబ్, ఎఫ్‌బీ, ఎక్స్ లైవ్ వీడియోల్లో వ్యూయర్‌షిప్ భారీగా తగ్గినట్టు పలువురు చెప్తున్నారు. కాగా, 'కాల్పుల విరమణ'లో బీజేపీ వైఖరిని ఎన్డీయేలోని టీడీపీ వంటి మిత్రపక్షాల సోషల్‌మీడియా విభాగాలు తప్పుబడుతూ సామాజిక మాధ్యమాల్లో కామెంట్లు పెడుతుండటం గమనార్హం.

**ప్రభావం చూపని ప్రసంగం**

'కాల్పుల విరమణ'పై ఆగ్రహంతో ఉన్న వారిని తన ప్రసంగంతో దారికి తెచ్చుకోవాలని ప్రధాని మోదీ ఎంతో ప్రయత్నించారు. భావోద్వేగపూరిత సంభాషణలతో స్పీచ్‌ను కొనసాగించారు. అయితే, ప్రజలు, మేధావులు మోదీ నోటివెంట వినాలనుకొన్నది సెంటిమెంట్ స్పీచ్ కాదు. 'కాల్పుల విరమణ' నిర్ణయాన్ని ఎందుకు, ఏ పరిస్థితుల్లో అంగీకరించాల్సి వచ్చిందన్న దానిపైనే అందరి ఆసక్తి నెలకొంది. అయితే, తన ప్రసంగంలో ఆ విషయాన్నే మోదీ దాటవేశారు. 'ట్రంప్ వాణిజ్య బెదిరింపుల వ్యాఖ్యల'పై కూడా ఆయన స్పందించలేదు. దీంతో మోదీ వైఖరిపై అందరూ మండిపడ్డారు. ప్రసంగం నిస్తేజంగా ఓ ప్రహసనంలా సాగిందని ధ్వజమెత్తారు. జాతినుద్దేశించి మాట్లాడటం పార్లమెంట్ సమావేశాలకు ప్రత్యామ్నాయం కాదని, బాధ్యతల నుంచి ప్రధాని తప్పించుకోలేరని ప్రముఖ జర్నలిస్ట్ రాజు పార్లేకర్ వంటి వారు బహిరంగంగానే విమర్శించారు. 'ట్రంప్ వాణిజ్య వ్యాఖ్యల'పై తన ప్రసంగంలో ఒక్కమాట కూడా ప్రధాని ఎత్తలేదు. అయితే, ప్రసంగం అయ్యాక.. అమెరికాతో చర్చల్లో వాణిజ్యం ప్రస్తావనే రాలేదంటూ కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఓ మొక్కుబడి ప్రకటనను విడుదల చేశాయి. దీంతో నెటిజన్లు మరింతగా మండిపడ్డారు. మొత్తంగా తన ప్రసంగం కూడా ప్రభావం చూపలేదని గ్రహించిన ప్రధాని మోదీ మంగళవారం పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించి జవాన్లతో ముచ్చటించారు. పనిలోపనిగా సైనికుల్లో ధైర్యాన్ని నింపేలా ప్రసంగించారు. భారత ఆడపడుచుల సిందూరం తుడిచిన వారి నట్టింట్లోకి వెళ్లి మరీ నాశనం చేశామంటూ మాట్లాడారు. భారత్‌ను, ప్రజలను రక్షించుకోవడానికి ఎంత పెద్ద నిర్ణయమైనా తీసుకొంటామన్నారు.

### డ్యామేజీ కంట్రోల్‌కు దిగినప్పటికీ..

**రక్షణ** రంగ, రాజకీయ, మేధోవర్గాల నుంచే కాదు సోషల్‌మీడియాలో కూడా 'కాల్పుల విరమణ' నిర్ణయంపై నెటిజన్లు మోదీ సర్కారుపై విమర్శలు చేయడం మొదలు పెట్టారు. ఇంతలో 'మాదే విజయమ'ని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. పాక్ సైనికులు మిఠాయిలు పంచుకొంటూ సంబురాలు చేసుకొన్న వీడియోలు వైరల్‌గా మారాయి. దీంతో మోదీ ప్రభుత్వంపై విమర్శల తీవ్రత మరింత పెరిగింది. ఇంటా బయటా ముప్పేట దాడి పెరుగుతుండటం, ఇంతలోనే 'కాల్పుల విరమణ' నిర్ణయాన్ని పక్కనబెట్టి సరిహద్దుల్లో పాక్ మళ్లీ డ్రోన్ల దాడులతో కవ్వింపులకు పాల్పడుతుండటంతో ఎన్డీయే ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అయ్యింది. డ్యామేజీ కంట్రోల్ చేసుకోకుంటే పరిస్థితి చేజారే ప్రమాదమున్నదని గ్రహించిన ప్రధాని మోదీ సోమవారం రాత్రి 8 గంటలకు జాతినుద్దేశించి ప్రసంగించారు. అయితే, అంతకు ముందే లైన్‌లోని వచ్చిన ట్రంప్.. వాణిజ్యం ఆపేస్తానని బెదిరించడంతోనే భారత్-పాక్ కాల్పుల విరమణకు ఒప్పుకొన్నాయని బాంబు పేల్చారు. దీంతో మోదీ సర్కారు తీవ్ర ఇరకాటంలో పడింది.


**బెడిసికొట్టిన ఆదంపూర్ పర్యటన**

జవాన్లతో మోదీ చేసిన వ్యాఖ్యలపై కూడా నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. 'పహల్గాం మహిళల సిందూరాన్ని దూరం చేసిన ఉగ్రవాదులను, వారిని ఎగదోసిన పాక్‌ను విడిచిపెట్టడమేనా మీరు చెప్తున్న ఆ పెద్ద నిర్ణయం' అంటూ నెటిజన్లు మోదీ వీడియోను ట్యాగ్ చేస్తూ ఎద్దేవా చేస్తున్నారు. యుద్ధానికి ముందు లేదా యుద్ధం జరుగుతున్నప్పుడు నాయకుడు అనే వాడు సైన్యంలో ధైర్యాన్ని నూరిపోయడం చూశాంగానీ, యుద్ధం పూర్తయ్యాక వెళ్లడమేంటని మోదీని ఉద్దేశిస్తూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. మొత్తంగా 'కాల్పుల విరమణ' ప్రకటన, దాని తదనంతర పరిణామాలపై ప్రధాని మోదీ ఆత్మరక్షణలో పడి ఇమేజ్ మేకోవర్ కోసం ప్రయత్నిస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆ ప్రయత్నాలు కూడా విఫలమవుతున్నాయని చెప్తున్నారు.

**ట్రంప్ వ్యాఖ్యలపై మోదీని నిలదీస్తాం**

భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ కోసం తన ప్రభుత్వం మధ్యవర్తిత్వం చేసిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యల గురించి ప్రభుత్వాన్ని అఖిల పక్ష సమావేశంలో ప్రతిపక్షం నిలదీస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం వెల్లడించారు. కాల్పుల విరమణ తోసహా భారత్, పాకిస్థాన్ మధ్య సరిహద్దు ఉద్రిక్తలలో తాజా పరిణామాలను చర్చించేందుకు వెంటనే అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు విలేకరులతో మాట్లాడుతూ ఆయన చెప్పారు. 'అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించినపుడు అసలు వాస్తవాలేంటి, ఏం జరిగింది, వంటి అంశాలన్నీ అడుగుతాం' అని ఖర్గే చెప్పారు.

### లోకం పోకడ




ఆరు గ్యారంటీలకు కూడా అక్కడికే వెళ్లండమ్మా.. పుణ్యముంటుంది!

## వాణిజ్యంపై చర్చించలేదు

### ట్రంప్ ప్రకటనను ఖండించిన విదేశాంగ శాఖ




న్యూఢిల్లీ, మే 13: వాణిజ్యం ఆపేస్తానని ఒత్తిడి తెచ్చి భారత్, పాక్‌ను కాల్పుల విరమణకు ఒప్పించానని ట్రంప్ చేసిన ప్రకటనను భారత విదేశాంగ శాఖ ఖండించింది. మిలిటరీ చర్యలపైనే చర్చలు జరిగాయని, వాణిజ్యం గురించి చర్చించలేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. కశ్మీర్ సమస్య దీర్ఘకాలికంగా కొనసాగుతున్నదని, ఇది భారత్, పాక్ మధ్య ద్వైపాక్షిక సమస్య అని, రెండు దేశాలే వీటిని పరిష్కరించుకుంటాయని, ఈ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టంచేశారు. కశ్మీర్ సమస్య పరిష్కారానికి తాను మధ్యవర్తిత్వం చేస్తానంటూ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఈ విషయంలో మూడో దేశం ప్రమేయాన్ని అంగీకరించబోమని రణధీర్ జైస్వాల్ తెలిపారు. అణుయుద్ధంపై ట్రంప్ చేసిన హెచ్చరికలపై ఆయన స్పందిస్తూ తమ సైనిక చర్య పూర్తి సంప్రదాయ పరిధిలోకి వస్తుందని తెలిపారు. అణ్వాయుధాల ప్రయోగానికి సంబంధించి పాకిస్థాన్ నేషనల్ కమాండ్ అథారిటీ ఈ నెల 10న సమావేశమవుతుందని వార్తలు వచ్చాయని, తర్వాత దానిని పాకిస్థాన్ విదేశాంగ శాఖ మంత్రే తిరస్కరిస్తూ ఖండించిన విషయాన్ని జైస్వాల్ గుర్తు చేశారు. అయినా భారత్ అణ్వస్త్ర బెదిరింపులకు భయపడదని, దానిని ప్రేరేపించే సరిహద్దు ఉగ్రవాదాన్ని అనుమతించదని, ఈ విషయంలో భారత్ దృఢమైన వైఖరిని కలిగి ఉందని రణధీర్ స్పష్టం చేశారు.

## 'వాణిజ్యం' ఆశ పెట్టి.. సీజ్‌ఫైర్‌కు ఒప్పించా!

### కాల్పుల విరమణపై మూడోసారి ట్రంప్ వ్యాఖ్యలు

### భారత్ ఖండించిన కాసేపటికే ప్రకటన



హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ): వాణిజ్యాన్ని ఎరగా చూపి భారత్- పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు ఒప్పించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. సీజ్‌ఫైర్‌పై చర్చల్లో సైనిక చర్యలు తప్ప వాణిజ్యం ప్రస్తావనే రాలేదని భారత విదేశాంగ శాఖ ప్రకటించిన గంటల్లోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ట్రంప్ మంగళవారం సౌదీ అరేబియాలో పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పారిశ్రామికవేత్తల సదస్సులో మాట్లాడుతూ.. తనకు యుద్ధాలంటే ఇష్టం లేదన్నారు. అందుకే భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించడానికి తన ప్రభుత్వం కృషి చేసిందన్నారు. రెండు దేశాల మధ్య చారిత్రక సీజ్‌ఫైర్ ఒప్పందానికి తాను మధ్యవర్తిత్వం వహించానని చెప్పారు. 'ఈ ఒప్పందం కుదరడానికి నేను వాణిజ్యంను అస్త్రంగా వాడాను. యుద్ధం మానేసి వాణిజ్యం చేసుకోవాలని సూచించా. అణ్వాయుధాల వ్యాపారం చేయడం కాదు.. మీ దేశాలు అభివృద్ధి చెందేలా వాణిజ్య సంబంధాలు పెంచుకోండి అని చెప్పాను' అని ట్రంప్ పేర్కొన్నారు. రెండు దేశాలకు శక్తివంతమైన, బలమైన, ఆలోచనాపరులైన, మంచి నాయకులు ఉన్నారని, తన మాటలు విని వారు సీజ్‌ఫైర్‌కు ఒప్పుకున్నారని చెప్పారు. దీంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గాయని తెలిపారు. లేకపోతే లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయేవారన్నారు. ఈ సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియోకు అభినందనలు తెలిపారు. 'వాళ్లిద్దరిని మరింత దగ్గరికి తీసుకురాగలం.. ఇద్దరూ కలిసి మంచి డిన్నర్ చేసేలా ఒప్పించగలం' అని భారత్, పాక్ ప్రధానులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

# గూగుల్ క్రోమ్ యూసర్లకు కేంద్రం వార్నింగ్!




గూగుల్ క్రోమ్ బ్రౌజర్ వాడుతున్న విండోస్, మాక్ యూజర్లను కేంద్రం హెచ్చరించింది. గూగుల్ క్రోమ్లో పలు లోపాలు ఉన్నాయని.. వాటిని హ్యాకర్లు అవకాశంగా మారే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వంలో నడిచే కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (CERT-In) పేర్కొంది. విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్, మ్యాక్ యూజర్లతో పాటు మ్యాక్ యూజర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. గూగుల్ క్రోమ్లోని లోపాలతో ఆయా కంప్యూటర్స్ హ్యాకర్ల బారినపడే ప్రమాదం ఉంటుందని చెప్పింది.

సమాచారాన్ని తస్కరించే అవకాశాలుంటాయని పే ర్కొంది. హ్యాకర్స్ నుంచి తప్పించుకునేందుకు యూజర్లు తప్పనిసరిగా క్రోమ్ని అప్డేట్ చేయాలని సూచించింది. క్రోమ్ సెక్యూరిటీ ప్యాచ్లు వస్తే.. వెంటనే అప్డేట్ చేయాలని చెప్పింది. ముఖ్యంగా .. 136.0.7103.48 /49కి ముందు వెర్షన్ గూగుల్ క్రోమ్ని వాడుతున్నట్లయితే తప్పనిసరిగా అప్డేట్ చేయాలనిచెప్పింది. విండోస్, మ్యాక్ ఓఎస్లోయూజర్లు తప్పని సరిగా అప్డేట్ చేయాలని తెలిపింది. హెచ్టీఎంఎల్లో హీప్ బఫర్ ఓవర్ఫ్లో, అవుట్ ఆఫ్ బౌండ్స్ మెమరీ యాక్సెస్, ౹evToolsలో లోపాల కారణంగా హ్యాకర్లు వాటిని సద్వినియోగం చేసుకో వచ్చని పేర్కొంది. దాంతో సున్నితమైన డేటాను యాక్సెస్ చేయడంతో పాటు సిస్టమ్ని వారి నియంత్రణలోకు తీసుకునే అందుకు అవకాశం ఉందని హెచ్చరించింది. అలాగే, లినక్స్ (Linux ) ఓఎస్లో గూగుల్ క్రోమ్ 136.0.7103.59 వర్షన్లకు ముందు వాడే వారంతా లేటెస్ట్ బ్రౌజర్కు మారాలని లేకపోతే.. అప్డేట్ చేసుకోవాలని సూచించింది. ఈ విషయంలో గూగుల్కు సమాచారం అందడంతో సెక్యూరిటీ ప్యాచ్లు విడుదల చేసిందని తెలిపింది. Chrome ని అప్డేట్ చేసేందుకు.. ఎగువ కుడి వైపున ఉన్న మూడు చుక్కలపై క్లిక్ చేయాలి. అందులో ఎడమవైపు కింద ఎబౌట్ అనే ఆప్షన్ కనిపిస్తుంది. ఆ ఆప్షన్ క్లిక్ చేయగానే ఆటోమేటిక్ బ్రౌజర్ అప్డేట్ అవుతుంది.

# 'వ్యూహాత్మక' వైఫల్యం!

మొదటిపేజీ తరువాయి...

విరమణకు అంగీకరించాయన్నది వాటి సారాంశం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా మీడియా ముందు ఇదే విషయాన్ని కుండబద్దలు కొట్టారు. ఇరుదేశాలను బెదిరించి, కాల్పుల విరమణపై రాజీ కుదిర్చానని ఆయన చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం భారత్-పాక్ మధ్య డీజీఎంవో స్థాయిలో తదుపరి చర్చలు జరిగాయి. ఈ చర్యతో అణ్వాయుధ సామర్థ్యమున్న ఇరుదేశాల మధ్య తాత్కాలికంగా ఉద్రిక్తతలు కొంత చల్లబడ్డప్పటికీ.. ప్రాంతీయ సమీకరణాల విషయంలో అమెరికా లాంటి బాహ్యశక్తులపై ఆధారపడాల్సి రావడం భారత్‌లాంటి దేశానికి అవమానకరమే. ఇది వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి పెద్ద మరక. అదే సమయంలో ఇప్పటివరకు ఇరుదేశాల ఇష్యూగా ఉన్న కశ్మీర్ వివాదంతోపాటు ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో అంతర్జాతీయ సహకారం కీలకమనే అంశాన్ని తాజా ఉదంతం తెరపైకి తెచ్చింది. స్వయంగా మూడోదేశం జోక్యాన్ని అంగీకరించడం.. భారత్ దౌత్యపరమైన పరిమితులను బహిర్గతం చేసింది.

**ప్రాంతీయ ఆధిపత్యానికి గండి**

కొన్ని దశాబ్దాలుగా దక్షిణాసియాలో భారత్ ప్రభావశీల దేశంగా నిలుస్తూ వచ్చింది. అమెరికా విదేశాంగ విధానానికి కొత్త అర్థం చెప్పిన మన్రో సిద్ధాంతంతో సరిసమానమైన ప్రాంతీయ ఆధిపత్యాన్ని హిందూ మహాసముద్ర తీర దేశాలపై భారత్ చాటుతూ వచ్చింది. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవుల వంటి పొరుగుదేశాలపై తన పట్టును పెంచుకోవడం ద్వారా, ఉపఖండంలో తిరుగులేని శక్తిగా భారత్ నిలబడింది. అయితే పహల్గాం ఘటన, తర్వాత అమెరికా జోక్యం ఈ ఆధిపత్యానికి గండి కొట్టాయి. ఇన్నాళ్లూ భూటాన్ లాంటి దేశాలపై చెక్కుచెదరని ప్రభావం చూపిన భారత్ స్థానంలో ఇప్పుడు బాహ్యశక్తులు రావడం.. క్షీణిస్తున్న భారత ఆధిపత్యానికి మరో సంకేతం. పొరుగున ఉన్న దేశాలతోనూ పరిస్థితులేం ఆశాజనకంగా లేవు. నేపాల్‌తోనూ సంబంధాలు నానాటికీ సన్నగిల్లుతున్నాయి. పాశ్చాత్య దేశాల మద్దతుతో అక్కడి ప్రభుత్వం భారత్ పెద్దరికాన్ని సవాల్ చేస్తున్నది. మరోవైపు బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవులు క్రమంగా చైనా, ఇతర ప్రపంచ శక్తులతో సంబంధాలు మరింతగా పెంచుకుంటున్నాయి. కొన్నాళ్లుగా చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు ఉపఖండంలో భారత్ పరపతిని పలుచన చేస్తూ వస్తున్నాయి. ఒకప్పుడు దక్షిణాసియాలో ప్రబల శక్తిగా ఉన్న భారత్ ప్రాభవం క్రమంగా తగ్గుతూ వస్తున్నది. ఈ క్రమంలో పహల్గాం దాడి.. భారత్ బలహీనతలను మరింత బహిర్గతం చేసింది. ఇన్నాళ్లు ఢిల్లీని పెద్దన్నలా చూసిన దేశాలు.. ఇప్పుడు ప్రత్యామ్నాయం వైపు దృష్టి పెట్టే అవకాశాలు మరింతగా పెరగనున్నాయి. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మోదీ పదే పదే భారత్‌ను విశ్వగురువుగా, అభివృద్ధి చెందుతున్న సూపర్ పవర్‌గా ప్రచారం చేస్తూ వచ్చారు. ఆర్థిక వృద్ధి, సైనిక ఆధునికీకరణ, ప్రపంచస్థాయిలో పలుకుబడి అందుకు సంకేతాలుగా ఆయన ఉదహరిస్తూ వచ్చారు. అయితే భారత్ ఇప్పటికీ 'సూపర్ పవర్' హోదాకు దూరంగా ఉన్నదని, తీవ్రమైన పరిమితులతో ఒక మధ్యస్థాయి శక్తిగానే మిగిలిందని గుర్తించాలి. ఈ దశలో పహల్గాం దాడి, దాని తదనంతర పరిణామాలు ఆ అంచనాల పైనా దెబ్బకొట్టాయి.

**పట్టు పెంచుకుంటున్న అమెరికా**

భారత్ బలహీనపడుతున్నదనే విమర్శలు ప్రత్యర్థులైన పాకిస్థాన్ నుంచో, చైనా నుంచో కాకుండా మిత్రపక్షంగా భావిస్తున్న అమెరికా నుంచి వస్తుండటం గమనార్హం. 'గ్రేట్ ఫ్రెండ్' అంటూ మోదీ తరుచూ చెప్పుకునే అమెరికానే.. 2021 నవంబర్‌లో 'ఫ్రీడమ్ ఆఫ్ నావిగేషన్' పేరిట నిర్వహించిన ఆపరేషన్ హిందూ మహాసముద్రం జలాల్లో భారత ఆధిపత్యానికి కొంతమేర నష్టంచేసింది. 'ఇండియా క్రమంగా అగ్రరాజ్యం గుప్పిట్లో చిక్కుకుంటున్నదా?' అన్న అనుమానాలు అప్పుడే చాలామందిలో కలిగాయి. ఇప్పుడు కాల్పుల విరమణలో అమెరికా జోక్యం తర్వాత ఆ 'పట్టు' ఎంతలా బిగుసుకుపోతున్నదో అర్థమవుతున్నది. మోదీ నుంచి అమెరికా పెద్దఎత్తున రాయితీలను పొంది ఉండవచ్చునని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ 'లావాదేవీ దౌత్యం'తో భారత స్వయం ప్రతిపత్తి సన్నగిల్లుతుందని, అగ్రరాజ్యం ఆధీనంలోని ఓ పావుగా దేశం మారిపోయే ప్రమాదముందని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అదే జరిగితే.. భారత్ సూపర్ పవర్ ఆశలు అమెరికా వ్యూహాత్మక ప్రాధాన్యాలకు లోబడే ఉంటాయి. బహుళ ధ్రువ ప్రపంచంలో దశాబ్దాలుగా భారత్ కాపాడుకుంటూ వచ్చిన తన స్వతంత్ర ప్రతిపత్తి ప్రమాదంలో పడవచ్చు.



### మోదీ.. ట్రాప్‌లో పడ్డారా?

**పాశ్చాత్య** దేశాల పొగడ్తల వెనుక ఉన్న అగాధాలను గ్రహించడంలో మోదీ విఫలమయ్యారా? ఒకవేళ అదే నిజమైతే భారత్ వ్యూహాత్మక వైఖరికి ఇది తీవ్ర నష్టదాయకం. పాశ్చాత్య శక్తులు తరుచూ వారు మార్చగల నాయకులను ప్రశంసిస్తాయి. అది వారి వ్యూహంలో భాగం. ఆ వ్యూహాన్ని మోదీ తప్పుగా అర్థం చేసుకున్నట్టు కనిపిస్తున్నది. ప్రశంసలను ఆయన సొంత పరాక్రమానికి రుజువులుగా భావించి ఉండవచ్చు. భారత దేశపు నిజమైన బలం దాని ఆర్థిక స్థిరత్వం, సాంకేతిక పురోగతి, వ్యూహాత్మక చతురతలో ఉన్నదేకానీ పాశ్చాత్య దేశాల డొల్ల ప్రశంసల్లో కానీ, దేశీయ మీడియా గాలికొట్టే కథనాల్లో కానీ లేదని గ్రహించాలి. మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత దౌత్యవేత్త ఎస్ జైశంకర్‌ను 2015లో విదేశాంగశాఖ కార్యదర్శిగా, 2019లో విదేశాంగ మంత్రిగా నియమించారు. అయితే జైశంకర్ భారత విదేశాంగ విధానాన్ని క్రమంగా అమెరికా వైపు మొగ్గుచూపేలా మార్చారన్న ఆరోపణలున్నాయి. అయితే ఆ మొగ్గు భారత్ కన్నా అమెరికాకే ఎక్కువ ప్రయోజనకారి అయ్యింది. అదే సమయంలో అనుకూలమీడియా ఆకాశానికెత్తడం, శక్తిమంతమైన నేతగా పదే పదే చిత్రీకరించడం.. వాస్తవిక ప్రపంచం నుంచి మోదీని దూరంగా తీసుకొని వెళ్లాయి. పహల్గాం వైఫల్యం, తదనంతర పరిణామాల్లో అమెరికా జోక్యం.. ఈ గాలి బుడగకు గుండుపిన్ను గుచ్చింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రాంతీయంగా తన ఆధిపత్యాన్ని భారత్ తిరిగి పొందాలంటే.. తన వ్యూహాత్మక వైఖరిని పునఃసమీక్షించుకోవాల్సిన అవసరమున్నది. ఆర్థిక పునరుజ్జీవం, సైనిక ఆధునికీకరణ, విదేశాంగ విధానాన్ని తిరిగి శక్తిమంతం చేసుకోవడం ద్వారా మాత్రమే భారత్ గత ప్రాభవాన్ని తిరిగి పొందగలదు. సమతుల్య, దృఢమైన దౌత్యాన్ని అనుసరించడం.. అమెరికా సహా పాశ్చాత్య దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడం కూడా అంతే ముఖ్యం. ప్రపంచ వేదికపై తన పాత్రను పునర్ నిర్వచించుకోవడానికి భారత్ దిద్దుబాటుకు పూనుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.





## పహల్గాం ఉగ్రవాదులను పట్టిస్తే రూ.20 లక్షలు

### జమ్ముకశ్మీర్‌లో వెలిసిన పోస్టర్లు

శ్రీనగర్, మే 13: గత నెల పహల్గాంలో 26 మంది పర్యాటకులను పొట్టనబెట్టుకున్న ముగ్గురు ఉగ్రవాదుల ఆచూకీ తెలియజేస్తే రూ.20 లక్షల బహుమతి ఇస్తామంటూ మంగళవారం అధికారులు ప్రకటించారు. ఈ మేరకు జమ్ముకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో పోస్టర్లు వెలిశాయి. పహల్గాం దాడికి కారకులుగా భావిస్తున్న పాకిస్థాన్‌కు చెందిన ఆసిఫ్ ఫౌజీ, సులేమాన్ షా, అబూ తల్హాల ఫొటోలతో పాటు ఉర్దూలో రాసిన ఈ పోస్టర్లలో వీరి గురించి సమాచారం, ఆచూకీ తెలియజేస్తే భారీ బహుమతి ఇస్తామని అధికారులు పేర్కొన్నారు.

# ముగ్గురు ఉగ్రవాదులు హతం

### మృతుల్లో లష్కరే తాయిబా టాప్ కమాండర్ • జమ్ముకశ్మీర్‌లోని షోపియాన్‌లో ఎన్‌కౌంటర్



శ్రీనగర్, మే 13: జమ్ముకశ్మీర్‌లో భద్రతా దళాలు జరిపిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతుల్లో లష్కరే తాయిబా (ఎల్ఈటీ) టాప్ కమాండర్ షాహిద్ కుట్టాయ్ కూడా ఉన్నాడు. షోపియాన్ జిల్లాలోని షూకల్ కెల్లర్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారం మేరకు భద్రతా దళాలు ఆ ప్రాంతంలో మంగళవారం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో అక్కడ దాగి ఉన్న ఉగ్రవాదులు వీరిపై కాల్పులు జరిపారు. దీంతో భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరపడంతో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన ముగ్గురు కూడా లష్కరేకు చెందిన వారేనని, మృతుల్లో ఇద్దరిని షాహిద్ కుట్టాయ్, అద్నాన్ షఫీగా గుర్తించామని, మూడో వ్యక్తిని గుర్తించాల్సి ఉందని అధికారులు తెలిపారు.